క్లుప్తంగా

దుర్గయ్యకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న దుర్గయ్య దంపతులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలోని రామునిపట్లకు చెందిన ఉపాధ్యాయుడు భైతి దుర్గయ్య ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో వసుంధర విజ్ఞాన వికాస మండలి 32వ వార్షికోత్సవ సభ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు దుర్గయ్యకు ప్రముఖ కవి డా.ఏనుగు నరసింహారెడ్డి పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు మధుకర్, కోటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుర్గయ్యను గ్రామస్తులు అభినందించారు.

ముగిసిన కేసీఆర్ టోర్నమెంట్


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నాయకులు

మర్కూక్(గజ్వేల్): గ్రామీణ ప్రాంత క్రీడాకారులు మంచి ప్రతిభను కనబరిచి రాణించాలని బీఆర్‌ఎస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు కనకయ్య, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి సూచించారు. మండలంలోని ఎర్రవల్లిలో కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. జగదేవ్‌పూర్, ఎర్రవల్లి జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో జగదేవ్‌పూర్ జట్టు విజేతగా నిలిచింది. క్రీడాకారులకు వారు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల మండల స్పోర్ట్ క్లబ్ చైర్మన్ కృష్ణ, నాయకులు బాలరాజు, నాగరాజు, రాజు, శ్రీనివాస్‌గౌడ్, మల్లేశం, నరేశ్‌రెడ్డి, స్వేరో నాయకుడు చిన్నికృష్ణ పాల్గొన్నారు.

నేర నియంత్రణకు సీసీ కెమెరాలు


కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ లతీఫ్, ఎస్‌ఐ రఘుపతి

దుబ్బాకటౌన్: సీసీ కెమెరాల ఏర్పాటుతో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ పకడ్బందీగా చేయవచ్చని తొగుట సీఐ షేక్ లతీఫ్ అన్నారు. రాయపోల్ మండలం గొల్లపల్లిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేను సైతం కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నాయకుడు ఐలపురం మహేశ్ సహకారంతో గ్రామంలో నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాలు లేని గ్రామాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారస్తులు కెమెరాల ఏర్పాటుకు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాయపోల్ ఎస్‌ఐ రఘుపతి, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం


వైద్య శిబిరంలో పాల్గొన్న మహిళలు

హుస్నాబాద్: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ అన్నారు. 100 రోజుల కార్యాచరణలో భాగంగా తిరుమల గార్డెన్ సమీపంలో మురుగు కాలువల్లోని చెత్తాచెదారాన్ని మంగళవారం తొలగించారు. 30 మంది స్ట్రీట్ వెండర్లకు యూనియన్ బ్యాంక్‌లో ఆరోగ్య బీమా చేయించారు. మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సంపత్‌రావు, సూపరింటెండెంట్ రమేశ్‌రెడ్డి, బ్యాంక్ మేనేజరు సంజీవ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలు ప్రారంభం

హుస్నాబాద్: ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పూసాల శ్రీనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3వ తరగతిలో 20, 4వ తరగతిలో 15, 5వ తరగతిలో 20, 6వ తరగతిలో 15, 7వ తరగతిలో 15, 8వ తరగతిలో 15, 9వ తరగతిలో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి గల వారు నేరుగా పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ఈ సారారైనా.. తెరుచుకొనేనా?

కరోనా ముందు ఆ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడేవి. కరోనా అనంతరం విద్యార్థులు కరువయ్యారు. విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో ఆ పాఠశాలలు మూతపడ్డాయి. గ్రామాల్లో విద్యార్థులున్నా కొంత మంది ఇతర గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలకు, మరి కొంతమంది ప్రైవేట్ విద్యాసంస్థలలోను చేరారు. గ్రామాల్లో అవగాహన కల్పించి మూతపడిన పాఠశాలలను తెరిపించేందుకు ప్రయత్నిస్తామని అధికారులు చెప్తున్నారు. దీంతో ఆయా పాఠశాలలకు పూర్వ వైభవం వస్తుందని గ్రామస్తులు ఆశిస్తున్నారు.

- రెండు గ్రామాల్లో మూతపడిన బడులు
- పూర్తికాని 'అమ్మ ఆదర్శ' పనులు
- విద్యార్థులకు అందని ఉచిత విద్య

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని నిర్మల్‌నగర్, రాంనగర్ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. నాలుగైదు యేళ్లుగా పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. దీంతో నేటికీ అవి తెరుచుకోలేదు. ఈ రెండు గ్రామాలలో ప్రాథమిక విద్య అభ్యసిస్తున్నవారు సుమారు 60 మందికి పైగా ఉన్నారు. ఆర్థిక పరిస్థితి మంచిగా ఉన్నవారి పిల్లలు ప్రైవేట్ విద్యాసంస్థలకు వెళ్తున్నారు. పేద విద్యార్థులు దగ్గరలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు వెళ్తున్నారు. బడిబాట ద్వారా ప్రచారం కల్పించి వాటిని తెరిపించేందుకు కృషి చేస్తున్నామని ఎంఈఓ, ఉపాధ్యాయులు చెప్తున్నారు.


వట్టిపల్లి పాఠశాలలో నిలిచిన వంట గది నిర్మాణం


నిర్మల్‌నగర్‌లో నిరుపయోగంగా ఉన్న పాఠశాల

నత్తనడకన మరమ్మతు పనులు

మండలంలోని చాలా పాఠశాలల్లో మరమ్మతు పనులు ప్రారంభించారు. వట్టిపల్లి, పలుగుగడ్డ, ఇటిక్యాల, చాట్లపల్లి, తిగుల్‌నర్సాపూర్, బిజివెంకటాపూర్ పాఠశాలలో సగంసగం పనులు పూర్తిచేసి మధ్యలోనే నిలిపివేశారు. వట్టిపల్లి పాఠశాలలో పిల్లర్ల దశలోనే వంట గది నిర్మాణం ఆగిపోయింది. అలాగే ఇటిక్యాల పాఠశాలలో పనులు చివరిదశలోను, బిజివెంకటాపూర్ పాఠశాలలో సగంలోనే ఆగిపోయాయి. ఈ నూతన విద్య సంవత్సరంలో కూడా విద్యార్థులకు మళ్లీ పాత సమస్యలే స్వాగతం పలుకుతాయా అనే ప్రశ్న తలెత్తుతోంది.

ప్రారంభించేలా చూస్తాం..



మండలంలోని నిర్మల్‌నగర్, రాంనగర్ ప్రభుత్వ పాఠశాలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. ఆ రెండు గ్రామాల్లోను చిన్నారుల తల్లిదండ్రులకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తాం. అలాగే అమ్మ ఆదర్శ మరమ్మతులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం.
– మాధవరెడ్డి, ఎంఈఓ, జగదేవ్‌పూర్

ఎవరూ ఆందోళన చెందవద్దు

- నెలాఖరు వరకు బియ్యం పంపిణీ
- కలెక్టర్ మనుచౌదరి

సాక్షి ఎఫెక్ట్..

దుబ్బాక: మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం కోసం ఎవరూ ఆందోళన చెందవద్దని, ఈ నెలాఖరు వరకు పంపిణీ జరుగుతుందని కలెక్టర్ మనుచౌదరి చెప్పారు. 'రేషన్ పరేషాన్.. గంటల తరబడి బియ్యం కోసం పడిగాపులు' అనే శీర్షికన సాక్షిలో సోమవారం వెలువడిన కథనానికి కలెక్టర్ స్పందించారు. మంగళవారం ఆయన మండలంలోని హబ్సీపూర్ రేషన్‌షాపును తనిఖీ చేశారు. కార్డుదారులు ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారు, బియ్యం నాణ్యత, సాంకేతిక సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన బియ్యం పంపిణీ విషయంలో ఎటువంటి జాప్యం, ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని డీలర్లను ఆదేశించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


సమస్యలపై ఆరాతీస్తున్న కలెక్టర్ మనుచౌదరి

పత్రికా స్వేచ్ఛపై దాడి హేయమైన చర్య


నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలుపుతున్న వివిధ పార్టీల నాయకులు, జర్నలిస్టులు

అఖిల పక్ష నాయకులు, జర్నలిస్టులు

హుస్నాబాద్: సాక్షి సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు అక్రమ అరెస్టు, సాక్షి కార్యాలయాలపై దాడి హేయమైన చర్య అని జర్నలిస్టులు, అఖిల పక్ష నాయకులు తీవ్రంగా ఖండించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో జర్నలిస్టులు, అఖిల పక్ష నాయకులు మంగళవారం నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా వ్యవహరిస్తుందన్నారు. రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతూ ప్రశ్నించే వారిని అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని మండిపడ్డారు. ప్రజా సమస్యలను పక్కన పెట్టి రాజకీయ కక్షలను ప్రేరేపించడం ప్రజాస్వామ్యానికి ఏ మాత్రం మంచిది కాదని వాపోయారు. పత్రిక కార్యాలయాలపై టీడీపీ కార్యకర్తలు దాడిచేసే సంస్కృతి చాలా ప్రమాదమని, దాడులు చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మాజీ ఎంపీపీ వెంకట్, వివిధ పార్టీల నాయకులు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, రవీందర్‌గౌడ్, శంకర్‌రెడ్డి, పున్న సది, నవీన్, వికాస్, జర్నలిస్టులు చల్లా రాజు, దుంద్ర ఎల్లయ్య, శ్రీనివాస్ నాయక్, గుంటిపెల్లి అజయ్, తేలు శ్రీకాంత్, ముస్కుల రాంరెడ్డి, వంగ రాజు, శ్రీనివాస్, సాజిద్, వేణు, శ్రీకాంత్, రాహుల్ నాయక్, తిరుపతి నాయక్, సతీశ్ పాల్గొన్నారు.

అంగన్వాడీలలో చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ


మాట్లాడుతున్న సీడీపీఓ ఎల్లయ్య

సీడీపీఓ ఎల్లయ్య

దుబ్బాకటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని సీడీపీఓ ఎల్లయ్య అన్నారు. అమ్మమాట– అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం దుబ్బాకలోని 12వ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అంగన్‌వాడీ కల్పిస్తున్న సౌకర్యాల గురించి చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం పిల్లలకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించవద్దని, అంగన్‌వాడీలోనే ప్రీ స్కూల్ విద్యనందిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ టీచర్లు సైతం గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్లాక్ కో–ఆర్డినేటర్ శ్యాంసన్, సూపర్‌వైజర్ చంద్రకళ, టీచర్లు శిరీష, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం

జగదేవ్‌పూర్(గజ్వేల్): అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పిల్లలకు పౌష్టికాహారం అందుతుందని సీడీపీఓ సరిత చెప్పారు. స్థానిక కేంద్రంలో అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడేళ్లు నిండిన పిల్లలను కేంద్రానికి పంపించాలన్నారు. వారం రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ భవాని, టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిన్నకోడూరు(సిద్దిపేట): అల్లీపూర్‌లోని కేజీబీవీలో కాంట్రాక్టు పద్ధతిలో బోధించడానికి మహిళ అధ్యాపకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారి నీలిమ తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, ఎకనామిక్స్, కామర్స్, సివిక్స్ సబ్జెక్టులకు గాను ఇంగ్లిష్ మీడియంలో బోధించాలని చెప్పారు. ఆ సక్తిగల అభ్యర్థులు 15వ తేదీలోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11 కేవీ ఫీడర్ పరిధిలోని చెట్లకొమ్మల తొలగింపు కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హనుమాన్‌నగర్, వడ్డెపల్లి దయానంద్ ఫంక్షన్‌హాల్, టూటౌన్ పోలీస్ స్టేషన్, రంగీలా దాబా, సీసీ గార్డెన్, లింగారెడ్డిపల్లి, వేములవాడ కమాన్ ప్రాంతాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ నిలిపివేస్తామని తెలిపారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 26 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా మంగళవారం విచారణ చేపట్టిన న్యాయమూర్తి రూ.48 వేలు జరిమాన విధించినట్లు సీఐ తెలిపారు.

పంటమార్పిడితో అధిక దిగుబడులు

వ్యవసాయ శాస్త్రవేత్త పల్లవి

కొండపాక(గజ్వేల్): ప్రతియేటా పంటల మార్పిడితో అధిక దిగుబడులు పొందవచ్చని తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త పల్లవి పిలుపునిచ్చారు. కుకునూరుపల్లి మండలంలోని మేదినీపూర్ రైతు వేదికలో మంగళవారం రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఖరీఫ్ సీజన్‌లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. కూరగాయలు, పండ్ల తోటలు, ఆయిల్‌పామ్ తోటలను సాగు చేసుకుంటూ రైతులు ఆర్థికంగా లాభపడాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు యశ్వంత్, శ్రీనివాస్, ఏఓ గోవిందరాజు, ఏఈఓలు రమ్యశ్రీ, శ్రీహరి, పంచాయతీ కార్యదర్శి రవళిక, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శాస్త్రవేత్త పల్లవి

అపరిచితులతో అప్రమత్తం

ఏఎస్‌ఐ ఉమారెడ్డి

గజ్వేల్‌రూరల్: అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని, ఇబ్బందులకు గురైన మహిళలు పోలీసులకు సమాచారం అందించాలని షీ టీమ్ ఏఎస్‌ఐ ఉమారెడ్డి పిలుపునిచ్చారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీ (ఎర్రవల్లి)లో మంగళవారం ప్రజలకు సైబర్ నేరాలు, మహిళలకు రక్షణ కల్పించే చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు ఏవైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే 100 లేదా షీ టీమ్ 87126 67434కు సమాచారం అందించాలన్నారు. సిబ్బంది మహేందర్‌రెడ్డి, శ్యామల, రామచంద్రారెడ్డి, మహేశ్, భరోసా సెంటర్ సిబ్బంది హరిత, వినోద పాల్గొన్నారు.

అవగాహన అవసరం

హుస్నాబాద్‌రూరల్: పల్లె ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని షీ టీమ్ బృందం మీర్జాపూర్ ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా టీం లీడర్ కృష్ణ సైబర్ నేరాలు ఎలా జరుగుతాయో వివరించారు. మహిళలు నిర్భయంగా సమస్యలను చెప్పుకుంటే న్యాయం చేస్తామని చెప్పారు.

ఉచిత నేత్ర వైద్య పరీక్షలు

సిద్దిపేటజోన్: ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ మంజుల, కమిషనర్ ఆశ్రిత్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక విపంచి ఆడిటోరియంలో మున్సిపల్ అధికారులు, సిబ్బందికి ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అరవింద్, తిరుమల్, శ్రీకాంత్, మున్సిపల్ డీఈ ప్రేరణ, అధికారులు పాల్గొన్నారు.

‘భూ భారతి’తో సమస్యల పరిష్కారం

హుస్నాబాద్‌రూరల్: రైతుల భూ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం భూ భారతి చట్టం తెచ్చిందని ఆర్డీఓ రామ్మూర్తి చెప్పారు. పందిల్లలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు హాజరై రైతుల దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త చట్టంతో ప్రతి సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. మండలంలో ఆరు గ్రామాల్లో నిర్వహించిన సదస్సులలో 228 మంది దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మారెడ్డి, నాయబ్ తహసీల్దార్ రుక్మిణిరెడ్డి, ఆర్‌ఐలు రాజు, రాజయ్య పాల్గొన్నారు.

చెప్యాలలో..

మిరుదొడ్డి(దుబ్బాక): చెప్యాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 134 దరఖాస్తులను స్వీకరించినట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వాటిని పరిశీలించి క్షేత్ర స్థాయిలో సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు శ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, సిబ్బంది సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమయపాలన తప్పనిసరి

కొమురవెల్లి(సిద్దిపేట): ఉద్యోగులంతా సమయపాలన పాటించాలని కమ్యూనిటీ మొబలైజింగ్ అధికారి రంగనాథ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో జిల్లాలోని వివిధ బాలికల హాస్టళ్లలో పనిచేస్తున్న పారిశుద్ధ్య ఉద్యోగులకు మంగళవారం జిల్లాస్థాయి శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభంకానున్న నేపథ్యంలో పాఠశాలల ఆవరణను శుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులతో పనులు చేయించవద్దని హెచ్చరించారు. రిసోర్స్ పర్సన్స్ తెలిపిన మెళకువలు నేర్చుకుని వాటిని పాటించాలని సూచించారు.


శిక్షణలో పాల్గొన్న ఉద్యోగులతో రంగనాథ్

20లోపే ‘కేజీబీవీ’ ప్రారంభం


పాఠశాలను పరిశీలిస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని 20వ తేదీ లోపే ప్రారంభించనున్నట్టు జిల్లా విద్యాధికారి(డీఈఓ) శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవన నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయన్నారు. ప్రారంభానికి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆహ్వానిస్తామని చెప్పారు. విశాలమైన తరగతి గదులు, అన్ని వసతులు కల్పించామని తెలిపారు. అంతకు ముందు గౌరవెల్లిలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రంగానాయక్, కేజీబీవీ పాఠశాల ప్రత్యేక అధికారి సరిత, ఏఈ సాయికిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యం అందుబాటులో ఉండాలి

ఏసీపీ సదానందం

మద్దూరు(హుస్నాబాద్): అధికారులు, సిబ్బంది ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఏసీపీ సదానందం అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డయల్ 100కు కాల్ రాగానే స్పందించి ఆయా సమస్యలను పరిష్కరించాలన్నారు. పారదర్శకంగా పరిశోధన చేయాలని, డ్రగ్స్, గంజాయిని అరికట్టడంలో ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. దూల్మిట్ట, కొండాపూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను పర్యవేక్షించి గ్రామస్తులతో మాట్లాడారు. ఎస్‌ఐ షేక్ మహబూబ్, సిబ్బంది పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏసీపీ సదానందం

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

- ఎంఈఓలు, ఉపాధ్యాయులు
- ముమ్మరంగా బడిబాట కార్యక్రమాలు

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ రమేశ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన అఖిలపక్ష సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్ బోధన అందిస్తున్నామన్నారు. అంతే కాకుండా యూనిఫారాలు, నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందిజేస్తున్నామని తెలిపారు. గ్రామాలలోని పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా చూడాలని అఖిలపక్ష నాయకులను కోరారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని వారికి సహకరించి ప్రభుత్వ బడులలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సాంస్కృతిక కళాసారథి పిన్నింటి రత్నం, ప్రవీణ్, సత్యనారాయణ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్లు, వివిధ నాయకులు పాల్గొన్నారు.

అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు బోధిస్తారని కొడకండ్ల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధునాల శ్రీనివాస్, పల్లెపహాడ్ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం మంజుల చెప్పారు. గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా వారు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాలమైన తరగతి గదులు, అన్ని మౌలిక వసతులతో పాటు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నామన్నారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గజ్వేల్‌రూరల్: పల్లెపహాడ్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కాపాడే బాధ్యత అందరిది

దుబ్బాకటౌన్: ప్రభుత్వ బడులను కాపాడే బాధ్యత మన అందరిపై ఉందని మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ అన్నారు. మల్లాయిపల్లి వార్డులో మంగళవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మూత బడిన పాఠశాలను తిరిగి తెరిచేందుకే బడిబాట కార్యక్రమం చేపడుతున్నామన్నారు. మల్లాయ్యపల్లి ప్రాథమిక పాఠశాలకు పూర్వవైభవం రావాలంటే తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్ రాణి, ఉపాధ్యాయులు స్వామి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన అడ్మిషన్లు

నంగునూరు(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగాయని ఎంఈఓ దేశిరెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం నర్మెట, పాలమాకుల, మగ్దుంపూర్, బద్దిపడగ గ్రామాల్లో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రచారం నిర్వహించారు. నర్మెట ప్రభుత్వ ఉపాధ్యాయుడు మన్నె హేమచందర్ తన కుమారుడి ప్రైవేట్ పాఠశాల నుంచి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడంతో ఎంఈఓ అభినందించారు.

అంకిరెడ్డిపల్లిలో..

చిన్నకోదూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చర్ల అంకిరెడ్డిపల్లిలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాల పంపిణీ చేసి ప్రచారం చేశారు. హెచ్‌ఎం సమ్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా నోట్ బుక్‌లు, పాఠ్యపుస్తకాలు, దుస్తులు, పౌష్టికాహారం అందిస్తుందన్నారు.

ప్రభుత్వ బడిలోనే చేర్పించండి

హుస్నాబాద్‌రూరల్: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని ఎంఈఓ మనీల పిలుపునిచ్చారు. మహ్మదాపూర్‌లో జరిగిన బడిబాట కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన ఊరి బడిలో సౌకర్యాలు ఉండగా.. ప్రైవేటు బడులకు పంపించి ఫీజులు చెల్లించి ఆర్థిక కష్టాలను ఎదుర్కోవద్దన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.